సాక్షి
శ్రీకాకుళం

గురువారం ♦ 3 ♦ జూలై ♦ 2025



పిల్లల బియ్యం పక్కదారి?

మధ్యాహ్న భోజనం కోసం పాఠశాలలకు పంపిస్తున్న బియ్యం పక్కదారి పడుతోంది. సన్న బియ్యం స్థానంలో నాసిరకం బియ్యం అంటగడుతున్నారు. - 8లో



సంతకాల సేకరణ

ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా ఉద్దానంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా రైతులు లక్ష సంతకాల సేకరణకు సిద్ధమయ్యారు. - 8లో

నకిలీ మద్యంతో జాగ్రత్త

శ్రీకాకుళం క్రైమ్ : అనధికార వ్యక్తుల (లైసెన్సు లేని) నుంచి నకిలీ మద్యం కొని ఆరోగ్యాన్ని దెబ్బతీసుకోవద్దని జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి తిరుపతినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివాహాలు, పార్టీలు, ఇతర వేడుకల్లో తక్కువ ధరకే మద్యాన్ని సరఫరా చేస్తామని నమ్మించి నకిలీ మందు అంటగడతారని తెలిపారు. వీటి సమాచారం తెలిస్తే 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు గానీ, జిల్లా ఎక్సైజ్ అధికారి 9440902332 నంబర్‌కు గానీ తెలియజేయాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. అరసవల్లి రోడ్డులోని హోటల్ సన్‌రైజ్‌లో గురువారం మధ్యాహ్నం 3గంటలకు మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన సమావేశం జరగనుందని పేర్కొన్నారు. శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ స్పీకర్, శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ పార్టీ కో-ఆర్డినేటర్ తమ్మినేని సీతారాం, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, నియోజకవర్గ సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ కమిటీలో వివిధ హోదాల్లో గల సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు, మాజీ డీసీసీబీ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

10,001 గారెలతో అభిషేకం



కాశీబుగ్గ: కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలో బంకేశ్వరమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామికి బుధవారం 10,001 గారెలతో అభిషేకం చేశారు.పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గొట్టా బ్యారేజీ నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

హిరమండలం : ఖరీఫ్‌లో శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి గొట్టా బ్యారేజీ నుంచి ఎడమ ప్రధాన కాలువలోకి నీరు విడుదల చేశారు. అనంతరం గొట్టా బ్యారేజీ నీటి నిల్వ, ఔట్ ఫ్లో, ఇన్ ఫ్లో ప్రవాహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంశధార అధికారులు మాట్లాడుతూ బ్యారేజీలో ప్రస్తుతం 38.1 మీటర్ల నీటిమట్టం ఉందన్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వంశధార ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్లు ఎ.రవీంద్ర, ఒ.ఆనందరావు, వంశధార ఎస్ఈ స్వర్ణకుమార్ పాల్గొన్నారు.

సీజీఎల్ పరీక్షల దరఖాస్తుకు తుది గడువు రేపే

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)-2025 సంవత్సరానికి సంబంధించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్) పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారంతో గడువు ముగియనుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం తెలిపారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్ 'బి', 'సి' పోస్టులు 14582 ఖాళీలు ఉండగా, ఆగస్టు 13 నుంచి 30 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ జూలై 4వ తేదీ రాత్రి 11 గంటలు కాగా, ఫీజు చెల్లింపునకు గడువు జూలై 5వ తేదీ రాత్రి 11 గంటల వరకు ఉందని వివరించారు. జూలై 9 నుంచి 11 వరకు దరఖాస్తుల సవరణకు అవకాశం ఉందని తెలిపారు. ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, పోస్టల్ అసిస్టెంట్, ఆడిటర్ వంటి 37 రకాల ఉద్యోగాలు భర్తీ కానున్నాయని చెప్పారు.

తొక్కి పెట్టడమే.. తొలి అడుగు



హామీల అమలులో సర్కారు తీరిదీ..!

- కొత్త డ్రామాలకు తెరతీసిన టీడీపీ
- 'సుపరిపాలన-తొలి అడుగు' పేరిట ప్రజల వద్దకు అధికార పార్టీ నాయకులు
- జిల్లాలో ఒక్కటంటే ఒక్క హామీ అమలు చేయని దుస్థితి
- చంద్రబాబు, లోకేష్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అదే మౌనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ఏడాది పూర్తయింది. ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టో అమలు చేయకపోగా అప్పటివరకు ప్రజలకు అందుతున్న సేవలు, పథకాలను అటకెక్కించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మాత్రమే కాకుండా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, బగ్గు రమణమూర్తి, బెందాళం అశోక్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, కూన రవికుమార్, గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు సూపర్ సిక్స్‌తో పాటు వ్యక్తిగత హామీలిచ్చారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయలేదు. ఎన్నికలు అయిపోయాక అబ్బే.. తాము అసలు అలాంటి హామీలే ఇవ్వలేదన్నట్టుగా గజినీని మించిపోయేలా నటించేస్తున్నారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. అయితే వీరిని సోషల్ మీడియా మరిచిపోవడం లేదు. ప్రతీ హామీని గుర్తు చేస్తోంది. అయినప్పటికీ మభ్యపెట్టడం, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంతోనే కాలం గడిపేస్తున్నారు. తాజాగా ఏడాది పాలనలో ఏదో ఉద్ధరించేశామన్నట్టు 'సుపరిపాలన - తొలి అడుగు' అంటూ కట్టుకథలు ఎన్నైనా చెప్పవచ్చని నిస్సిగ్గుగా ప్రజలకు వద్దకు వెళ్తున్నారు. కూటమి నాయకులు ఇచ్చిన కొన్ని హామీలను పరిశీలిస్తే...

చంద్రబాబు హామీలు నీటి మూటలు



- పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,అగ్నిమాపక కేంద్రం, 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం.
- ఆమదాలవలస నియోజకవర్గంలో పురుషోత్తపురం వద్ద వంశధార నదిపై, ముద్దాడపేట వద్ద నాగావళి నదిపై వంతెన పనులు, నారాయణపురం ఆనకట్ట ఆధునీకరణ పనులు పూర్తి చేస్తాం. వంశధార ప్రాజెక్టును పూర్తి చేసి నిర్వాసితులకు న్యాయం చేస్తాం.
- నియోజకవర్గానికొక ఇంజినీరింగ్ కళాశాల. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు. కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు. జీడి పిక్కల 80 కిలోల బస్తా మద్దతు ధర రూ.16 వేలు చేస్తాం. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. వంశధార కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేస్తాం. పలాసలో రైతు బజారు ఏర్పాటు. ఇవేవీ అమలుకాలేదు.
- వంశధార, నాగావళి నదులను అనుసంధానం, నరసన్నపేట పరిధిలో ఎత్తిపోతల పథకం పూర్తి, వంశధార- బాహుదా నదుల అనుసంధానం చేస్తామన్నా.. ఆ ఊసేలేదు.
- పలాసలో డిఫెన్స్ కోచింగ్ సెంటర్, టెక్కలిలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తాం. బుడగట్లపాలెంలో మత్స్యకార జెట్టీ నిర్మాణం చేస్తాం. పలాస-కాశీబుగ్గలో రైల్వే ఫ్లై ఓవర్ వంతెన పూర్తిచేస్తాం. కళింగ వైశ్యులను ఓబీసీలో చేర్చుతాం.

వీటిలో ఒక్కటంటే ఒక్కటీ అమలు కాలేదు.

అమలుకు నోచుకోని లోకేష్ హామీలు..



- టీడీపీ అధికారంలోకి రాగానే బొంతు, కామేశ్వరిపేట ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తాం. వంశధార ప్రాజెక్టు, పెండింగ్‌లో ఉన్న వనిత మండలం వంతెన, ఆమదాలవలస - పోలాకి వంతెన పూర్తి చేస్తాం. నాగావళి-వంశధార నదిపై పురుషోత్తపురం వద్ద వంతెన, ఆమదాలవలసలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో సెజ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు.

నీటి మీద రాతలు రామ్మోహన్‌నాయుడు మాటలు..

- సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. చేసిందేమీ లేదు.
- ప్రముఖ పుణ్యక్షేత్రాలను కలుపుతూ టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి చేస్తామన్నారు. మిగతా వాటి సంగతి పక్కన పెడితే అరసవల్లి దేవాలయానికే దిక్కు లేకుండా పోయింది.
- ప్రధాన రహదారులతో పాటు గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లే అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామన్నా.. ఆ ఊసే చేయలేదు.
- నాగావళి- వంశధార, బాహుదా- మహేంద్రతనయ నదుల అనుసంధానం అమలుకాలేదు.
- మత్స్యకారుల కోసం కోస్టల్ కారిడార్, శీతల గిడ్డంగులు నిర్మిస్తామన్నారు. ఇంతవరకు జరిగింది శూన్యం.
- జిల్లాలో ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్ అన్నారు. దాని ఊసేలేదు.

టెక్కలి: ఏదీ అభివృద్ధీ..



- టెక్కలిలో వైద్య కళాశాల ఊసే లేదు.
- వంశధార ప్రధాన కాలువకు సిమెంటు లైనింగ్ పనులు చేయలేదు.
- శివారు ప్రాంతానికి సాగునీరు అందించలేదు.
- ఎత్తిపోతల పథకాలు నిర్మించి వంశధార నీరు చేరని ప్రాంతాలకు నీరందిస్తామన్నారు. అందించలేదు.
- నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించలేదు.
- జిల్లా కేంద్రానికి దీటుగా టెక్కలిని అభివృద్ధి చేస్తామన్నా.. ఎక్కడా చేయలేదు.
- పర్యాటకాభివృద్ధికి భావనపాడు నుంచి విశాఖ వరకు సాగర కారిడార్ హామీ నెరవేరలేదు.
- ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్ ఏర్పాటుకు అతీగతి లేదు.

నరసన్నపేట: 'పేట'లో కానరాని పురోగతి..



- బొంతు ఎత్తిపోతల పథకం పూర్తి చేయలేదు.
- మడపాం ఎత్తిపోతల పథకం ఊసేలేదు.
- వంశధార కాలువల అభివృద్ధికి కనీసం అడుగులు పడలేదు.
- ప్రతి ఇంటికీ తాగునీరు ఎక్కడా అందించలేదు.
- నరసన్నపేట సామాజిక ఆసుపత్రి ఆధునీకరణ జరగలేదు.
- వనితమండలం వంతెన నిర్మాణం జోలికే పోలేదు.
- శ్రీముఖలింగం తాగునీటి ప్రాజెక్టును వినియోగంలోకి తేలేదు.
- స్టేడియం పనుల్లో పురోగతి లేదు.

పలాస: ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..



- పలాసలో రైతు బజారు ఏర్పాటు కాలేదు. ఇండోర్ స్టేడియం కోసం ఒక్క అడుగు కూడా పడలేదు.
- కేటీరోడ్డు, కాశీబుగ్గ రైల్వే గేటుపై ఓవర్ వంతెన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.
- కిడ్నీ సమస్యలపై పరిశోధనలకు ఊతమిస్తామన్నారు. ఉన్న ఆసుపత్రిపై నిర్లక్ష్యం చూపిస్తున్నారు.
- జీడికి మద్దతు ధర ఇవ్వలేదు కదా ఉన్న ధరలు పడిపోతున్న పరిస్థితి.
- పేదలకు మూడు సెంట్లు స్థలం ఒక్కరికీ ఇవ్వలేదు.

ఆమదాలవలస: అతీగతీ లేదు...



- నారాయణపురం ఆనటకట్ట అభివృద్ధి ఊసే లేదు.
- నాగావళి-వంశధార నదుల అనుసంధానం ఎక్కడికక్కడే ఉంది.
- బలసలరేవు వంతెన నిర్మాణానికి అతీగతీ లేదు.
- రైతు కూలీలకు కార్పొరేషన్ ఊసేలేదు.
- ఉద్యోగం చేసే మహిళలకు హాస్టల్ వసతి ప్రతిపాదనకే నోచుకోలేదు.

శ్రీకాకుళం: హామీలు ఘనం... అమలు శూన్యం



- కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం పూర్తి కాలేదు.
- శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలకు ఎటువంటి అడుగులు పడలేదు.
- మత్స్యకారుల కోసం మినీ జెట్టీల ప్రతిపాదనలే జరగలేదు.
- నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలుకాలేదు. కూల్చివేతలు, పాతపనులపై మెరుగులు దిద్దడం తప్ప చేసిందేమీ లేదు.
- నగరంలో రోడ్లు అభివృద్ధి పేరిట గుంతలు కప్పి డబ్బులు వృథా చేశారు. అవన్నీ మళ్లీ గుంతలుగా మారాయి.
- పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున పేదలకు స్థలాలు ఇస్తామన్నా.. ఆ ఊసేలేదు.

ఎచ్చెర్ల: ఎక్కడి పనులు అక్కడే..

- బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, జెట్టీ నిర్మాణం పూర్తి చేయకపోగా గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఫిషింగ్ హార్బర్ పనులను నిలిపివేశారు.
- తోటపల్లి కాలువ ద్వారా పూర్తిస్థాయిలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు.
- మడ్డువలస కాలువ, నారాయణపురం కాలువ పనులు పూర్తి కాలేదు.
- బుడుమేరు చెరువును మినీ రిజర్వాయర్‌గా చేస్తామన్న ఊసేలేదు.
- మత్స్యకారుల వలసలు నివారించే ప్రయత్నమే జరగడం లేదు.
- స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడం లేదు.
- ఉద్యోగులకు పీఆర్‌సీ ఇవ్వలేదు.



పాతపట్నం: ఒక్క అడుగు పడితే ఒట్టు...



- పాతపట్నంలో 50 పడకల సీహెచ్‌సీ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అమలు చేస్తామని హామీ అమలు చేయలేదు.
- పాతపట్నంలో మహిళా కళాశాల, సాంకేతిక కళాశాల(పాలిటెక్నికల్ కళాశాల) ఏర్పాటు కాలేదు.
- బూరగాం వద్ద మహేంద్ర తనయా నదిపై వంతెన నిర్మాణం చేపట్టలేదు.
- హిరమండలం మండలం కల్లట-జిల్లెడుపేట గ్రామాల మధ్య మహేంద్ర తనయా నదిపై వంతెన నిర్మాణం అమలు కాలేదు.
- ఐటీడీఏ ఏర్పాటు కాలేదు.
- కొత్తూరులో డిగ్రీ కళాశాల, రైతు బజారు, మహిళా కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకాలేదు.
- నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదు.

ఇచ్ఛాపురం: అనుసంధానమా.. అదెక్కడ

- గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలమిస్తామన్నా ఒక్కరికీ ఇవ్వలేదు.
- వంశధార జలాలు ఇచ్ఛాపురం వరకు మళ్లించే ప్రాజెక్టు పూర్తి కాలేదు.
- ఇంటింటికీ తాగునీరు.. అతీగతి లేదు.
- బాహుదా, మహేంద్రతనయ నదులపై సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరణ ప్రతిపాదనలే కన్పించడం లేదు.
- గంగాసాగరం జలాశయం పనులు అడుగు కూడా ముందుకు పడలేదు.
- రూర్బన్ నిర్మాణాలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి.
- కిడ్నీ బెంతొరియా సమస్యలపై ముఖం చాటేస్తున్నారు.



ప్రభుత్వ తీరుకు నిరసనగా ప్రైవేటు పాఠశాలల బంద్ నేడు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేటు పాఠశాలలపై రాష్ట్రప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు, విధానాలకు నిరసిస్తూ గురువారం ప్రైవేటు పాఠశాలల బంద్ పాటిస్తున్నట్టు ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం(ఆప్సా) జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి బి.చంద్రమోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళంలోని విశాఖ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రశాఖ నిర్ణయం మేరకు జిల్లాలో అన్ని ప్రైవేటు పాఠశాలలు (కార్పొరేట్‌తో సహా) బంద్‌కు మద్దతు తెలిపినట్టు చెప్పారు. ఉచిత విద్యాహక్కు చట్టం ప్రకారం చేపడుతున్న ప్రవేశాల విషయంలో ప్రైవేటు పాఠశాలలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడుతుండటం బాధాకరమన్నారు. తాము చెప్పినట్టు చేయకపోతే.. పాఠశాలల గుర్తింపును రద్దుచేస్తామని హెచ్చరిస్తుండటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గత మూడేళ్ల ఫీజులు ఇప్పటి వరకు ఎలాంటి చెల్లింపులు జరగకపోవడంతో విద్యాసంస్థలను ఎలా నడిపించగలమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సచివాలయ మహిళా పోలీసులకు బదిలీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసుల బదిలీలు చేపట్టారు. దాదాపు 850 మందిని దివ్యాంగులు, ఏజెన్సీ ప్రాంతం, ఆరోగ్యపరమైన సమస్యలు, స్పౌస్ కోటా, జనరల్ ప్రాతిపదికన విభజించి బదిలీలు చేశారు. బుధవారం రాత్రి 10 గంటలు దాటేసరికి సుమారు 350 మందికి మాత్రమే కౌన్సిలింగ్ జరిగినట్లు సమాచారం. అర్ధరాత్రి దాటే వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని అధికారుల ద్వారా తెలియడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళా పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆటో డ్రైవర్ల జీవితాలతో ఆటలా?

- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం వెళ్లాలా?
- ఇచ్ఛాపురంలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన ఆటో, క్యాబ్ డ్రైవర్లు
- సీఐటీయు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



లొద్దపుట్టి తులసమ్మ ఆలయం వద్ద ఆటో, క్యాబ్‌లతో డ్రైవర్ల నిరసన

ఇచ్ఛాపురం రూరల్ : కూటమి ప్రభుత్వ తీరు నిరసిస్తూ ఇచ్ఛాపురంలో ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి రావాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన సుమారు రెండు వేల మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మ ఆలయం వద్ద నుంచి ఇచ్ఛాపురం ప్రాంతీయ రవాణా అథారిటీ(ఆర్‌టీఓ) కార్యాలయం వద్దకు వాహనాలతో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయు ప్రతినిధులు, ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ గతంలో వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను ఇచ్ఛాపురంలోని ఆర్‌టీఓ కార్యాలయం వద్ద అధికారులు జారీ చేసేవారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆటోల ఫిట్‌నెస్ కోసం 130 కిలోమీటర్ల దూరంలో శ్రీకాకుళం రమ్మంటున్నారని, దీంతో రెండు వైపులా 260 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రవాణా శాఖ ఆదేశాలు ప్రకారం ఆటో 60 కిలో మీటర్ల మేరకు మాత్రమే ప్రయాణించాలన్న నిబంధనలు ఉండగా.. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి రావాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సుదూర ప్రాంతం ప్రయాణించడం ద్వారా ఒక్కో ఆటో కార్మికుడికి రెండు వేల రూపాయల వరకు ఖర్చవుతుందని వాపోయారు. ఇప్పటికే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం శ్రీకాకుళం వెళ్లిన ఇద్దరు ఆటో కార్మికులు మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు.

న్యాయం చేయాలి



ఇప్పటికే ఆటో కార్మికుల జీవనం కష్టంగా మారుతున్న సమయంలో ఇరువైపులా 260 కిలో మీటర్లు ప్రయాణించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో సుమారు రెండు వేల రూపాయల వరకు ఖర్చవుతోంది. గతం మాదిరిగా ఇచ్ఛాపురంలోనే సర్టిఫికెట్ జారీ చేయాలి.

– ఉలాసి యర్రయ్యరెడ్డి, అధ్యక్షుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఆటో యూనియన్

రెండు మూడు సార్లు వెళ్తేనే..



ఆటో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం శ్రీకాకుళం ఒకేసారి వెళ్తే పని జరగడం లేదు. వివిధ కారణాలతో వాయిదాలు వేస్తుండటంతో రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఆటో కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు.

– డి.వెంకటరావు, కోశాధికారి, ఎం.ఎస్.పల్లి ఆటోయూనియన్

అసెంబ్లీలో ప్రస్తావించినా..

ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంలో వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ జరిగేదని, దాన్ని శ్రీకాకుళం తరలించడంతో ఆటో కార్మికులు అవస్థలు పడుతున్నారని, వెంటనే ఇచ్ఛాపురంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు అనుమతులు ఇవ్వాలంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రస్తావించినప్పటికీ తమకు ఇంత వరకు న్యాయం జరగలేదని ఆటో కార్మికులు బహిరంగంగా విమర్శించారు. అటు పాలకులు, ఇటు అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, ఇచ్ఛాపురం ఆటో యూనియన్ అధ్యక్షుడు ఉలాసి యర్రయ్యరెడ్డి, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం ఆర్‌టీఓ కార్యాలయం వద్ద ఆటో, క్యాబ్‌ల ర్యాలీ

క్లుప్తంగా

తరగతుల విలీనం ఆపాలి



బందరువానిపేట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న దృశ్యం

గార: తమ గ్రామంలోని పాఠశాలను విలీనం చేయవద్దని కళింగపట్నం – మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం) యూపీ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. ఈ పాఠశాలలో 6, 7, 8 తరగతులకు చెందిన 40 మంది విద్యార్థులను కోకావారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న స్కూల్‌కు ప్రధాన రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుందని, దీనివలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి దాతలు, తల్లిదండ్రులు విరాళాలు పోగుచేసి కంప్యూటర్లు, కళావేదిక, వలంటీర్లు నియమించుకున్నామని, ప్రైవేటు పాఠశాలల నుంచి కూడా చాలా మంది విద్యార్థులు వచ్చి చేరడం జరిగిందన్నారు. ఐతే ఇప్పుడు ప్రభుత్వం విలీనం పేరిట విద్యార్థులను తరలించడం భావ్యంగా లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేదంటే పూర్తిగా ప్రభుత్వ పాఠశాలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

వ్యాక్సిన్ల కొరతతో ఇబ్బందులు



సమయం పూర్తికాక ముందే తాళాలు వేసి ఉన్న వ్యాక్సిన్ రూమ్

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో ప్రతీ బుధవారం చిన్నారులకు వేసే వ్యాక్సిన్ల కొరత ఏర్పడుతుండడంతో ఇబ్బందులు నెలకొంటున్నాయని పలువురు వాపోతున్నారు. బుధవారం వేసే వ్యాక్సిన్లలో ప్రధానంగా డీపీటీ, రోటా, ఐపీవీ వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో 4, 10, 14 నెలల వయస్సు చిన్నారులకు పూర్తిస్థాయిలో వ్యాక్సిన్లు వేయలేని పరిస్థితి నెలకొంది. కాగా బుధవారం టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాక్సిన్లు వేయాల్సి ఉండగా, సిబ్బంది సమయపాలన పాటించకుండా వారికి ఇష్టం వచ్చినప్పుడు వెళ్లిపోతున్నారని సుదూర ప్రాంతాల నుంచి చిన్నారులను పట్టుకుని వచ్చిన తల్లులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వ్యాక్సిన్ల కొరత, సిబ్బంది సమయపాలనపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

విలేజ్ సర్వేయర్ల బదిలీల్లో గందరగోళం

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా విలేజ్ సర్వేయర్ల బదిలీల్లో గందరగోళం ఏర్పడిందని, ఇప్పటివరకు ఎటువంటి ప్రక్రియ ప్రారంభించకపోవడం ఆందోళన కలిగిస్తోందని విలేజ్ సర్వేయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధుబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీల ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 30కే పూర్తికాగా జిల్లాలో ఇప్పటివరకు ప్రారంభించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈనెల 1వ తేదీన రాత్రి 10 గంటలకు పెడతామని, తర్వాత ఈనెల 2వ తేదీన ఉదయం 7 గంటలకు అంబేడ్కర్ ఆడిటోరియంకి అటెండ్ అవ్వాలని జిల్లా ఉన్నతాధికారులు మౌలిక ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే విలేజ్ సర్వేయర్లు అంతా సిద్ధమయ్యాక బదిలీ ప్రక్రియ క్యాన్సిల్ అయ్యిందని మళ్లీ చెప్పారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ అయిపోయినా, మన జిల్లాలో ఎందుకు అవ్వలేదో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

ఆవును రక్షించిన ఫైర్ సిబ్బంది



బావిలోకి దిగుతున్న ఫైర్ సిబ్బంది

సోంపేట: మండలంలోని బెంకిలి గ్రామానికి చెందిన తాళ్ల యాదవయ్య జెర్సీ ఆవు బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో బెంకిలి వ్యవసాయ నేలబావిలో పడిపోయింది. సమాచారాన్ని స్థానికులు వెంటనే సోంపేట ఫైర్ సిబ్బందికి తెలియజేశారు. అగ్నిమాపక శాఖాధికారి బి.మోహనరావు ఆధ్వర్యంలో సిబ్బంది డి.భాస్కరరావు, బి.అప్పారావు, రామినాయుడు, బాబురావు, మనోజ్‌కుమార్, వెంకటరావు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బావిలో పడిన ఆవును తాడు సాయంతో బయటకు తీసుకొచ్చి ప్రాణాలు కాపాడారు. స్థానిక రైతులు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పిల్లల బియ్యం పక్కదారి..?

- రెండో విడతలోనే నీరుగారిన లక్ష్యం
- పాఠశాలలకు నాసిరకం బియ్యం పంపిణీ
- తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- సన్నబియ్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు



కవిటి పాఠశాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు తదితర ప్రభుత్వ విద్యారంగ సంస్థల్లో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్నబియ్యం అందించాలని నిర్ణయించింది. అయితే ఈ పథకం ప్రారంభమైన ఒక్క నెలలోనే నీరుగారుతోంది. నాణ్యమైన సన్న బియ్యం స్థానంలో నాసిరకం పురుగులతో కూడిన బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా కవిటి మండలంలో ఈ బియ్యంపై జరిగిన తనిఖీల్లో ఈ పురుగుల బియ్యం బాగోతం బయటపడింది. ఈ బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లయ్ శాఖ ద్వారా ఎంఎల్‌ఎస్ పాయింట్స్, అక్కడ నుంచి పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు ఇలా ఆయా పాఠశాలలకు అందజేస్తారు. కేవలం పాఠశాలలకు సంబంధించి నెలకు 15,468 ప్యాకెట్లు (ఒక ప్యాకెట్ 25 కిలోలు వంతున) అందజేస్తున్నారు. ఇవి కాకుండా ఇతర సంస్థలు కేజీబీవీ, గురుకులాలు వంటి వాటికి కూడా ఇదేస్థాయిలో బియ్యం బ్యాగ్‌లు అందిస్తున్నారు. అయితే వీటిలో జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారుల అవినీతి వలన పురుగుల బియ్యంను అందజేస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారులకు ఫిర్యాదులు

ఈ బియ్యం సరఫరా చేయడం జూన్ నెలలో ప్రారంభించారు. అయితే రెండో విడతలో పాఠశాలలకు సరఫరా అయిన బియ్యం చాలా వరకు నాసిరకంగా, పురుగులు ఉన్నాయని పాఠశాలల హెచ్‌ఎంలు విద్యాశాఖ, సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ ఫిర్యాదులు జిల్లాస్థాయిలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారికి చేరినా చర్యలు తీసుకోలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల ప్రారంభంలో సన్నబియ్యం నెల్లూరు, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి సరఫరా జరిగాయి. తొలి విడతలో నాణ్యమైన బియ్యం వచ్చాయి. అందువలన దీనిలో మార్పులు జరగకుండా క్యూఆర్ కోడ్ టాగింగ్ విధానం ఏర్పాటు చేశారు. అయితే రెండో విడతలోనూ ఇతర జిల్లాల నుంచి నాణ్యమైన బియ్యమే వచ్చినా, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు లోకల్ బియ్యానికి క్యూ ఆర్ కోడ్ ట్యాగులు వేసి పాఠశాలలకు సరఫరా చేసినట్లు తెలుస్తోంది. దీనివలన రెండో విడతలో వచ్చిన నాణ్యమైన సన్నబియ్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్వాలిటీ సిబ్బంది వైఫల్యం

పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలకు అందించే బియ్యాన్ని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారులు తనిఖీలు చేయాలి. వాటి నాణ్యతను పరిశీలించి, అనుమతులు ఇవ్వాలి. అయితే ఈ విభాగం జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారి నియంత్రణలో ఉంటుంది. కానీ క్వాలిటీ కంట్రోల్ అధికారి వ్యవస్థ ఈ కార్యాలయంలో నిర్వీర్యం చేయడంతో ఎటువంటి తనిఖీలు జరగడం లేదని ఈ బియ్యం సరఫరా ద్వారా తేటతెల్లమవుతోంది. వీరు కూడా ఈ బియ్యాన్ని సరఫరా చేసే మిల్లర్లతో కుమ్మక్కై, అవినీతికి పాల్పడి నాసిరకం బియ్యానికి అనుమతులు ఇస్తున్నారని తెలుస్తోంది.

పురుగులు ఉన్నట్లు గుర్తింపు

విద్యార్థుల ఎండీఎం బియ్యంపై ఎంఎల్‌ఎస్ పాయింట్లు, పాఠశాలల్లో విరివిగా తనిఖీలు చేయాలని ఇటీవల జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్లు, ఇతర అధికారులు తనిఖీలు చేపట్టారు. తాజాగా కవిటి మండలంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో 25 కిలోల నాణ్యమైన సన్నబియ్యం ప్యాకెట్లను తనిఖీ చేస్తుండగా, అందులో తెల్లచీమ, పురుగులు ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ పురుగుల బియ్యం బాగోతం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారుల నిర్వాహకం వెలుగు చూసింది.

మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు

కవిటి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న బియ్యంలో పురుగులు ఉన్నట్లు తహసీల్దార్ బి.మురళీమోహనరావు గుర్తించారు. తొలుత ఈ విషయాన్ని విద్యార్థులు విలేకరులకు తెలియజేయగా.. వారు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో వంట చేస్తున్న సమయంలో వెళ్లి తనిఖీలు చేశారు. పురుగులు ఉండడం వాస్తవమేనని నిర్ధారణకు వచ్చిన తర్వాత జాయింట్ కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం చేరవేశారు. దీనిపై జేసీ స్పందిస్తూ సంబంధిత అధికారులు, బాధ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పురుగుల బియ్యం మార్చి నాణ్యమైన స్టాక్ విడుదల చేయాలని ఆదేశించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



డివిజన్ స్థాయి సమీక్ష సమావేశానికి హాజరైన రెవెన్యూ అధికారులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హిరమండలం: అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. మండలంలో కల్లట గ్రామంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో టెక్కలి డివిజన్‌లోని తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, హెచ్‌డీటీలు ఆర్‌ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లు, వీఆర్వోలతో రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రజా సమస్యల పరిష్కార వినతులు, నిషేధిత భూముల వివరాలు, ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్ తదితర రెవెన్యూ అంశాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. పలు మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు సరైన సమాచారం చెప్పకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీజీఆర్‌ఎస్‌లో వినతుల పరిష్కారంపై మండల గ్రీవెన్స్ మానిటరింగ్ అధికారి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతిరోజూ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

రైతులకు అవగాహన కల్పించాలి

రీ సర్వేలో ల్యాండ్ ఎల్‌పీఎం(ల్యాండ్‌పాస్ మ్యాప్) గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. రైతులు భూహద్దులు నిర్ణయించుకుని ఎల్‌పీఎంలు చేసుకోవడం వలన రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తిస్తాయన్నారు. దీనిపై గ్రామ, మండల సర్వేయర్లకు స్పష్టమైన సూచనలు చేశారు. ఏపీ సేవా, మీసేవాలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ అంశాల సత్వర పరిష్కారానికి క్షేత్రస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ సహాయక కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా భూసర్వే, రికార్డుల నిర్వహణ అధికారి కె.రమేష్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డివిజన్ స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మా ఊరు బడి.. మాకు కావాలి



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆమదాలవలస: మండలంలోని గాజుల కొల్లివలస పాఠశాలను ఆర్ఆర్ కాలనీలో విలీనం చేయడం ప్రభుత్వానికి తగదని విద్యార్థులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ మేరకు పాఠశాల వద్ద బుధవారం నిరసన చేపట్టారు. 30 మంది విద్యార్థులున్న పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయడం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాల తరలించే ప్రయత్నం మానుకోవాలని లేకుంటే న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే వారం రోజులుగా విద్యార్థులకు హాజరు కూడా వేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకుంటే దశలవారీగా దీక్షలు చేసి నిరాహార దీక్ష చేపట్టేందుకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మొండేటి కూర్మారావు, విద్యార్థుల తల్లిదండ్రులు సవలపురపు కృష్ణ, శ్రీనుగోక రమేష్, పాలకొండ శంకర్, నవిరి రమణ, నీలవేణి, శంకర్, సంగమేశ్వర్, సవలాపురపు శాంతి కుమారి, రాజు, పైడి లక్ష్మి, నవిరి రాజు, రాణి, గొర్లె సంధ్య, దుప్పలపూడి రజిని తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



వజ్రపుకొత్తూరు రూరల్: మాట్లాడుతున్న ఎయిర్ పోర్టు వ్యతిరేక కమిటీ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా ఉద్దానంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణకు సిద్ధమైనట్లు కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ, ప్రజాసంఘాల నాయకులు, బాధిత రైతులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మండలంలోని చీపురపల్లి పంచాయతీ పరిధి అనకాపల్లిలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనసీమను తలపించే పచ్చని ఉద్దాన ప్రాంతాన్ని, తీరప్రాంతాన్ని ధ్వంసం చేసే కార్గో ఎయిర్‌పోర్టు వద్దన్నారు. తమ అభిప్రాయాలను పలువిధాలుగా ప్రభుత్వానికి చెప్తున్నా తమ గోడు వినిపించుకోకుండా ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో తమ బతుకులను రోడ్డున పడేయాలని కంకణం కట్టుకుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొరమ వాసు, నాయకులు జె.అప్పారావు, దున్న హరి, కె.తులసీదాస్, లోకనాథం, రాజు, దమయంతి, జి.లోకనాథం, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా బుధవారం ఉదయం కొంతమంది వ్యక్తులు ఇతర రాష్ట్రాల నుంచి భారీ యంత్రాలతో సర్వే పేరిట ఈ ప్రాంతానికి వచ్చారు. ఇది గమనించిన బాధితులు చేరుకొని వాహనాలను నిలుపుదల చేసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోర్టు వద్దు.. మా ప్రాంతం ముద్దు అంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

మందసలో...

ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీన ఉదయం 9 గంటలకు ఒంకులూరు గ్రామ కమ్యూనిటీ భవనంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మిస్తే ఈ ప్రాంతానికి తీవ్రనష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బత్తిన లక్ష్మణరావు, దున్న హరికృష్ణ, కొండ తులసీదాస్, లోకనాథం, భాస్కరరావు, సుంకర రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల: ఒక సంవత్సరం పీజీ డిప్లమో ఇన్ గాంధీయన్ సోషల్ వర్క్ కోర్సులో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్న ఈ కోర్సుకు సంబంధించిన తరగతులు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. 30 సీట్లు ఉన్న ఈ కోర్సుకు ఏదైనా డిగ్రీ చేసినవారు అర్హులని తెలిపారు. రూ.2 వేలు ఫీజు చెల్లించి జూలై 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలకు కౌన్సిలింగ్ ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు 78930 54967 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వంశీ(ఫైల్)

రణస్థలం: మండలంలోని అర్జునవలస పంచాయతీ గడిజాలపేట గ్రామ సమీపంలోని రామతీర్థాలు రహదారిపై బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. జేఆర్‌పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని సంచాం గ్రామానికి చెందిన దాకమర్రి వంశీ(21), తన స్నేహితుడు పవన్‌తో కలిసి విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గడిజాలపేట దగ్గర మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు పాలైన వంశీని తొలుత రణస్థలం సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వెనుక కూర్చొని ఉన్న పవన్ చిన్న, చిన్న గాయాలతో బయటపడ్డారు. మృతుడి తండ్రి దాకమర్రి అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

సంస్కారహీనుడు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న పేరాడ తిలక్

- నకిలీ నోట్లు మాఫియాతో ఆయనకు సంబంధాలు
- మండిపడిన పేరాడ తిలక్

టెక్కలి: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, వలసలు నివారించాలనే ఉద్దేశంతో మూలపేట పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దారుణమైన వ్యాఖ్యలు చేసిన సంస్కారహీనుడు మంత్రి అచ్చెన్నాయుడని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. టెక్కలిలోని అయోధ్యపురం సమీపంలో ఉన్న పోర్టురోడ్డులో మీడియా సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, కిడ్నీ ఆస్పత్రి, ఉద్దానానికి తాగునీరు అందించిన వ్యక్తిని, వెయ్యి అడుగుల గోతులో పాతేస్తానని బుర్ర తక్కువ వ్యాఖ్యలు చేస్తావా అని దుయ్యబట్టారు. అచ్చెన్నాయుడిని, అతని కుటుంబ సభ్యులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఈ జిల్లా ప్రజలు, నియోజకవర్గానికి చెందిన ప్రజల కోసం ఆ కుటుంబం ఒక్క అభివృద్ధి పనైనా చేసిందా అని ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో రాజకీయ పబ్బం గడుపుతున్న కింజరాపు కుటుంబం చేయలేని అభివృద్ధిని తమ నాయకుడు చేశారని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో 80 శాతం పనులు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు 80 శాతం పోర్టు పనులు పూర్తయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటాలు కుదరకపోవడంతో కొన్ని నెలల పాటు పోర్టు పనులు నిలిపివేశారని తిలక్ దుయ్యబట్టారు. మరలా కింజరాపు కుటుంబం సొంత ప్రయోజనాలకు కమీషన్లు కుదరడంతో పోర్టు పరిశీలన పేరుతో పర్యటనలు చేయడం సిగ్గు చేటుగా లేదా అని నిలదీశారు. పోర్టు అప్రోచ్ రోడ్డులో రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. దొంగనోట్లు మాఫియాతో జత కడుతూ టెక్కలి నియోజకవర్గంలో రౌడీ షీటర్లను పక్కన పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తి అచ్చెన్నాయుడని ఆరోపించారు. అచ్చెన్నాయుడు చేస్తున్న అరాచకాలకు వత్తాసు పలుకుతున్న కొంతమంది అధికారులు జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే భవిష్యత్‌లో బాధపడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హెచ్.వెంకటేశ్వర్రావు, వైస్ ఎంపీపీ పి.రమేష్, బన్నువాడ సర్పంచ్ పి.మోహన్‌రావు, నాయకులు సత్తారు సత్యం, ఎం.గణపతిరావు, టి.పాల్గుణరావు, జె.జయరాం, పి.రమణబాబు, కె.జీవన్, బి.రాజేష్, ఎం.రమేష్, పి.శ్యామలరావు, ఆర్.మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల పోస్టులు భర్తీ చేయాలి

- తీర్మానించిన బార్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు శివప్రసాద్

శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లా కేంద్రంలో ఉన్న 15 న్యాయస్థానాల్లో పలు న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి భర్తీకి చర్యలు తీసుకోవాలని బార్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. బుధవారం కోర్టు పాత బార్ కార్యాలయంలో జిల్లా బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు మూడు నెలల ఆదాయ, వ్యయాలు మరియు మూడు నెలల ప్రొగ్రెస్‌ను సభ్యులకు వివరించారు. అసోసియేషన్ సమస్యలపై చర్చించి తీర్మానం చేశారు. ముఖ్యంగా జిల్లాకోర్టు ప్రాంగణంలో ఖాళీగా ఉన్న మూడు కోర్టుల మేజిస్ట్రేట్ల నియామకం చేపట్టాలన్నారు. సమావేశంలో స్టేట్ బార్ మెంబర్ జి.వాసుదేవరావు, కార్యవర్గ సభ్యులు ఇప్పిలి సీతరాజు, భవానీ ప్రసాద్, కొమ్ము రమణమూర్తి, వనజాక్షి, శంకర్ సీనియర్లు, బీసీ న్యాయవాద సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, పూర్వ భారీ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ, పీవీ రమణరావు, పీవీ రమణ దయాల్, నాగభూషణం, విజయ్ కుమార్, సుభాష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి



కరపత్రం విడుదల చేస్తున్న ఏఐటీయూసీ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): లేబర్ కోడ్‌లు రద్దు, పని గంటలు పెంపు, సుప్రీంతీర్పు ప్రకారం జీతాలు ఇవ్వాలని కోరుతూ జూలై 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు టి.తిరుపతిరావు, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, మున్సిపల్ ఇంజినీరింగ్ జిల్లా కార్యదర్శి ఆర్.సతీష్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా, అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. కార్మికులకు సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.శ్యామలరావు, సరస్వతీ, కరుణ, జి.లక్ష్మి, పార్థసారధి, జె.గురుమూర్తి, రసూల్, చంటి తదితరులు పాల్గొన్నారు.

• అభినందనీయం



చిన్నారులతో పాఠశాల ఉపాధ్యాయులు

మండలంలోని వీఎన్‌పురం గ్రామానికి చెందిన ఎస్.దామోదరరావు తన ఇద్దరు పిల్లలను అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం చేరిపించారు. దామోదరరావు ఆమదాలవలస మండలం గేదలవానిపేటలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దీంతో ఆయనను తోటి ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందుతోందని తెలియజేశారు.

నరసన్నపేట